# శ్రీసాయిసచ్చరిత్రము

## ఉపోద్ఘాతము

మహారాష్ట్ర దేశములోని వారందరికి శ్రీగురుచరిత్ర సుప్రసిద్ధము. ఆ దేశమంతటను దత్తాత్రేయభక్తులు దీనిని చదివెదరు. కొందరు దీనిని నిత్య పారాయణము చేసెదరు. దీనిని రచించినవారు సరస్వతీ గంగాధరుడు.

### నేటి గురు చరిత్ర

ఇందులో శ్రీపాదశ్రీవల్లభస్వామి యొక్కయు, శ్రీ నరసింహసరస్వతిస్వామి యొక్కయు లీలలును విచిత్ర చర్యలును వర్ణింపబడియున్నవి. వీరిద్దరు దత్తాత్రేయుని ముఖ్యావతారములు. ప్రముఖ మరాటీ గ్రంథకర్తయగు శ్రీ యల్.ఆర్. పాంగార్కర్ అభిప్రాయము ప్రకార మీ రెండవతారములు 14, 15 శతాబ్దములలో వెలసెను. దత్తాత్రేయుని తదుపరి యవతారములు కూడ గలవు. ఇందులో ముఖ్యమైనవి నైజాము ఇలాఖాలో శ్రీ మాణిక్యప్రభువును, షోలాపూరు జిల్లాలో శ్రీ అక్కల్‌కోటకర్ మహారజ్‌గారు, తుట్టతుదకు అహమదునగరు జిల్లాలోని శిరిడీలో శ్రీ సాయిబాబాయును. బాబా 1918వ సంవత్సరములో మహాసమాధి చెందిరి. శ్రీ అక్కల్‌కోటకర్ మహారాజ్ అవతార పరంపరయే శ్రీ సాయిబాబాయని కొందరి భక్తుల నమ్మకము. అయిదవ యధ్యాయములో వేపచెట్టు క్రింద పాదుకలు ప్రతిష్ఠించిన కథయు, ఇరువదియారవ యధ్యాయములో చెప్పబడిన హరిశ్చంద్రపితళే అనుభవమును ఈ నమ్మకమును దృఢపరచుచున్నవి.

పైన వివరించిన రెండు అవతారముల విచిత్ర లీలలను శ్రీ గురుచరిత్రమను గ్రంథమందు 53 అధ్యాయములలో సరస్వతీ గంగాధరుడెట్లువర్ణించెనో యటులనె శ్రీ గోవిందరఘునాథ్ ఉరఫ్ అన్నాసాహెబు దాభోళ్కరు ('హేమాండ్ పంతు') అనువారు శ్రీ సాయిలీలలను 53 అధ్యాయములలో శ్రీసాయిసచ్చరిత్రమను గ్రంథమున వర్ణించియున్నారు. కనుక నీ శ్రీసాయిసచ్చరిత్రము యీనాటి 'గురుచరిత్రయ'ని చెప్పవచ్చును.

పై చరిత్రల గూర్చి ఈ దిగువ వివరించిన అంశములు గమనార్హములు:

1. శ్రీగురుచరిత్రను వ్రాసినవారు కన్నడమువారు కాబట్టి, వారికి మరాటీ భాష బాగుగా తెలియకుండెను. అయినప్పటికీ వారి ఇష్టదైవము యొక్క ఆశీర్వాదమువల్ల మరాటీ భాషలో ప్రసిద్ధికెక్కిన గొప్ప గ్రంథమును వారు వ్రాయగలిగిరి. శ్రీసాయిసచ్చరిత్రము యొక్క గ్రంథకర్త సుప్రసిద్ధ మరాటీవారు. వారు మహారాష్ట్ర దేశములోని యనేక యోగుల చరిత్రలను చదివియున్నారు. ప్రసిద్ధిచెందిన ఏకనాథ భాగవతము వారి నిత్యపారాయణ గ్రంథము. శ్రీసాయిసచ్చరిత్రమును జాగ్రత్తగా చదివినచో, ఏకనాథ భాగవతములోని పెక్కు విషయములు శ్రీసాయిసచ్చరిత్రములో పొందుపరచబడియుండుట చూడగలరు.

2. శ్రీ గురుచరిత్ర ముఖ్యముగా కర్మకాండపై నాధారపడియుండుటచె దానిని బోధపరచుకొనుట బహుకష్టము. దానిని నాచరణలో బెట్టుట మఱింత కష్టము. దత్తాత్రేయుని ముఖ్యశిష్యులు గూడ దాని నాచరణలో పెట్టలేకున్నారు. శ్రీసాయిసచ్చరిత్ర విషయము అట్టిది కాదు. అందులోని విషయములు తేటతెల్లములు, మిక్కిలి సామాన్యమైనవి. ఇందులో చెప్పినవానిని అందరు సులభముగా గ్రహించి యాచరణలో పెట్టగలరు.

3. శ్రీగురుచరిత్రలో వర్ణించిన విషయములు అవి జరిగిపోయిననూరెండ్లకు వ్రాయబడెను. కానీ శ్రీసాయిసచ్చరిత్రములోని కొన్ని లీలలను రచయిత స్వయముగా చూచెను. శ్రీ సాయిబాబా యొక్క యనుమతి పొంది, వారి యాశీర్వాదముతోఈ గ్రంథమును ప్రారంభించెను. వారి యాజ్ఞానుసారము అక్కడక్కడ ముఖ్యమైన విషయములు, లీలలు టూకిగా వ్రాసియుంచుకొనెను. 1918వ సంవత్సరములో సాయిబాబా సమాధిచెందిన తరువాత, శ్రీ సాయిలీల మాసపత్రికలో శ్రీ సాయిచరిత్రమును కొంచెము కొంచెముగా ప్రకటించెను. శ్రీసాయిసచ్చరిత్ర మీవిధముగ 1923 నుండి 1929 వరకు శ్రీసాయిలీలలో ధారావాహికముగ ప్రచురింపబడి, 1930లో పూర్తిగ్రంథరూపముగ ముద్రింపబడినది. కనుక శ్రీసాయిసచ్చరిత్రమను ప్రస్తుత గ్రంథము అధికారికమైనది. శిరిడిలో శ్రీసాయిబాబా సశరీరులుగ యుండగా దర్శించుకొను భాగ్యము లభించని సాయిభక్తులకు యీ గ్రంథము నిజముగ యొక వరము.

శ్రీసాయిసచ్చరిత్రమును అన్నాసాహెబు దాభోళ్కరు కూర్చెను. కాని, ప్రతి అధ్యాయము చివరను శ్రీసాయి ప్రేరేపణచే 'హేమాండ్‌పంతు'చే వ్రాయబడినట్లున్నది. కావున ఈ హేమాండ్‌పంతు ఎవరని పాఠకులడుగవచ్చును. అన్నాసాహెబు దాభోళ్కరు మొట్టమొదటిసారి

శ్రీసాయిబాబాను సందర్శించినప్పుడు, వారీ బిరుదును దాభోళ్కరుకు కరుణించిరి. ఎప్పుడు ఏ సందర్భములో నీ బిరుదునతనికి నొసంగిరో యను విషయము రెండవ అధ్యాయములో రచయితయే చెప్పియున్నారు. అన్నాసాహెబు జీవిత చరిత్ర యీ దిగువ క్లుప్తముగా చెప్పబడినది.

గ్రంథరచయిత యగు దాభోళ్కరు 1859లో సంవత్సరములో ఠాణాజిల్లాలోని కేళ్వేమాహిమునందు యొక పేద ఆద్యగౌడబ్రాహ్మణ కుటుంబములో జన్మించిరి. వారి తాతతండ్రులు దైవభక్తిగలవారు. దాభోళ్కరు తమ ప్రాథమిక విద్యను స్వగ్రామమందే పూర్తిచేసి, పూనాలో 5వ స్టాండర్డు వరకు ఆంగ్లవిద్యనభ్యసించిరి. కుటుంబ ఆర్థికపరిస్థితులంత బాగుగా నుండకుండుటచే వారు పై క్లాసులు చదువుట మానుకొనిరి. అప్పట్లో నున్న సర్కారు నవుకరి పరీక్షలో నుత్తీర్ణులైతన ఊరిలోనె బడిపంతులు ఉద్యోగములో ప్రవేశించిరి. ఆ సమయమందు కూలాబా జిల్లాలో మామల్తదారుగా నున్న సాబాజి చింతామణి చిట్ణీస్ అనువారు వీరి సచ్ఛీలతను, బుద్ధికుశలతను, సేవానిరతిని చూచి మెచ్చుకొని తలాఠీయను గ్రామోద్యోగిగా నియమించిరి. తరువాత ఇంగ్లీషు గుమాస్తాగా వేసిరి. పిమ్మట మామల్తాదారు కచేరిలో హెడ్ గుమస్తాగా నియమించిరి. కొంతకాలము జరిగిన పిమ్మట అటవీశాఖలో  ఉద్యోగిగా నుంచిరి. కొన్నాళ్ళకు కరువు సంబంధపు పనులందు ప్రత్యేకోద్యోగిగా గుజరాత్ లోని బ్రోచ్‌లో నియమితలైరి. ఆయా ఉద్యోగములలో తన బాధ్యతలను అత్యంత సమర్థవంతముగ నెరవేర్చుట వలన 1901-వ సంవత్సరములో ఠాణా జిల్లాలోని శాహాపూరులో మామల్తదారుగానియమింపబడిరి. 1903-వ సంవత్సరములో ఫస్టుక్లాసు రెసిడెంటు మెజిస్ట్రేటుగా బాంద్రాలో నియమింపబడిరి. వారచ్చట 1907 వరకు ఉద్యోగము చేసిరి. తరువాత ఆయన ముర్బాడు, ఆనంద్, బోర్సదులలో పనిచేసి, 1910-వ సంవత్సరములో తిరిగి బాంద్రాలో రెసిడెంటు మెజిస్ట్రేటుగా నియమితులైరి. ఈ సంవత్సరమందే వారికి శిరిడీకి పోయి శ్రీ సాయి సందర్శనము చేయు భాగ్యము కలిగెను.

1916-వ సంవత్సరములోవారు ఉద్యోగవిరమణ చేసిన పిమ్మట కొన్ని నెలల వరకు తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసిరి. అదియును విరమించిన తరువాత సాయిబాబా మహా సమాధి చెందువరకు శ్రీసాయిసేవలోనే పూర్తిగ నిమగ్నులయిరి. బాబా మహాసమాధి పిమ్మట శిరిడీ శ్రీసాయిబాబా సంస్థానమును, 1929-వ సంవత్సరములోతాను మరణించువరకును, ఎంతో చాకచక్యముగ నడిపిరి. వారికి భార్య, ఒక కుమారుడు, అయిదుగురు కుమార్తెలుండిరి. బిడ్డలకు తగిన సంబంధములు దొరికినవి. అందరు క్షేమముగా నున్నారు.

## సాయిబాబా యెవరు?

సాయిబాబా యెవరు? -- అను ప్రశ్నకు మూడు విధములుగా సమాధానము చెప్పవచ్చును:

1. దీర్ఘాలోచన చేయకయే, విషయములగూర్చి గాని, మనుష్యులను గూర్చిగాని యభిప్రాయము చెప్పు అభ్యాసము గలవారు సాయిబాబానొక పిచ్చి ఫకీరనియు, వారు శిరిడీలో శిథిలమై పాడుపడిన మసీదులో ననేక సంవత్సరములు నివసించిరనియు, ఇష్టము వచ్చినట్లుగా మాట్లాడుచు, తమను దర్శింప వచ్చినవారి నుంచి దక్షిణరూపముగా ధనము వసూలు చేయుచుండిరనియు చెప్పుదురు.

ఈ అభిప్రాయము తప్పు! ఆర్.ఏ.తర్ఖడ్‌గారి స్నేహితుడు ఒకసారి బాబా దర్శనాంతరము, బాబా వద్ద సెలవుపుచ్చుకొని బొంబాయి తిరిగి పోవునపుడు కంటతడి పెట్టుకొనెను. అతనితో బాబా యిట్లనెను, "పిచ్చివానివలె ప్రవర్తించుచున్నావేమి? నేను బొంబాయిలో మాత్రము నీతో లేనా?" దానికి తర్ఖడ్‌గారి మిత్రుడిట్లు జవాబిచ్చెను: "నాకా విషయము తెలియదు. ఎందుకనగా, మీరు బొంబాయిలో నాతో నున్నట్లు నా కనుభవము లేదుకదా!" అందులకు బాబా యిట్లనెను: "ఎవరయితే బాబా శిరిడీలో మాత్రమే యున్నాడని యనుకొందురో వారు బాబాను నిజముగా గ్రహింపలేదని తెలుసుకో!".

2. కొందరు సాయిబాబాను మహాప్రసిద్ధపురుషుడనిరి. మహమ్మదీయులు బాబాను తమ పీరులలో నొకనిగా భావించిరి. హిందువులు బాబాను తమ మహాత్ములలో నొకనిగా గ్రహించిరి. ప్రతి సంవత్సరము శిరిడీలో జరుగు ఉత్సవముల నిర్వాహకులు తమ ప్రకటనలలో బాబాను 'సంతచూడామణి'గా పేర్కొనెదరు.

ఈ యభిప్రాయము కూడ సరియైనది కాదు!

3. శ్రీసాయిబాబాను సన్నిహితముగాను, వాస్తవముగాను సేవించిన వారు మాత్రము బాబాను భగవదవతారముగా నిప్పటికిని భావించుచున్నారు. దీనికి కొన్ని దృష్టాంతముల నిచ్చెదను.

1. బి.వి. నరసింహస్వామిగారు రచించిన 'బాబా సూత్రములు-పలుకులు' అను గ్రంథమునకు పీఠికలో ఇండోరు హైకోర్టు జడ్జిగారగు యమ్.బి. రేవే గారు ఇట్లు వ్రాసి యున్నారు: *''బాబా సశరీరులుగయున్నప్పుడు, వారొక రూపుదాల్చిన భగత్స్వరూపముగ తమ భక్తులకు భాసిల్లుతూ, తమ లీలాప్రభోధాల ద్వారా సాధకుల మార్గమును ప్రకాశింపజేయుచుండెడివారు. వారి నశ్వరమైన దేహము మాయమైపోయినది గాని, దానిలో అప్పుడుండిన 'బాబా' మాత్రము నిప్పటికిని అనంతశక్తివలె నిలిచి, వారు సమాధి చెందకముందు భక్తులకు తోడ్పడినట్లే ఇప్పటికిని వారినాశ్రయించు యసంఖ్యాక భక్తులకు నిశ్శబ్దముగా సహాయపడుచున్నారు.''*

2. శ్రీ బి.వి. నరసింహస్వామిగారు రచించిన 'భక్తుల యనుభవములు' అను పుస్తకములోని మొదటి పేజీలో ఉత్తర భారతదేశములో నున్న ఒక హైకోర్టు జడ్జిగారిట్లు వ్రాసియున్నారు.

''నేను సాయిబాబాను సృష్టి స్థితి లయకారకుడుగా భావించెదను. 1918వ సంవత్సరములో వారు సమాధి చెందకముందు నేనట్లు భావించితిని. ఇప్పటికి నేనట్లే భావించు చున్నాను. నాకు మాత్రము వారు సమాధి చెందినట్లు లేదు. నా దృష్టిలో, వారు అన్ని పరిమితులకు అతీతులు. వారు మా మధ్య యున్నప్పుడు వారి మానవశరీరము మా కనుల ముందు సంచరించుచుండెను. ఒక్కొక్కప్పుడది మా దృష్టిని విశేషముగా నాకర్షించెడిది. కానీ, ఎక్కువ భాగము మా ఎరుకలో నిలచినది మాత్రము వారి అనంత తత్త్వమే. శాశ్వతము - అశాశ్వతముల అద్భుత సమ్మేళన రూపమైన యొక మానసిక ప్రతిబింబమువలె వారు మాకు భాసించేవారు. అశాశ్వతమైన తమ మానవదేహము నొక్కకప్పుడు మా ముందర తళుకుమని మెరిపించేవారు. ఇప్పుడు అశాశ్వతమైన ఆ దేహము మాయమై, 'సాయిబాబా' యను శాశ్వతమైన అనంతశక్తి మాత్రము నిలిచియున్నది.''

3. బి.వి. నరసింహస్వామి గారిచే రచింపబడిన 'భక్తుల యనుభవములు' అను గ్రంథములో 19-20 పుటలలో ఆచార్య జి.జి. నార్కే, (యం.ఏ.యం.యస్.సి., పూనా ఇంజనీరింగు కాలేజి) యిట్లు చెప్పి యున్నారు:

''ఇంటివద్ద నిత్యము నేను పూజించు గృహదేవతల మధ్య సాయిబాబా నొకరినిగా నుంచితిని. సాయిబాబా భగవంతుడు. ఆయన సామాన్య సత్పురుషుడు కాడు. మా మామగారగు శ్రీమాన్ బూటీ, నా భార్య, నా తల్లి గొప్ప సాయి భక్తులు. వారు సాయిబాబాను భగవంతునివలె పూజించువారు. నేను క్రొత్తగా శిరిడీకి పోయినప్పుడొకనాడు ఆరతి సమయములో సాయిబాబా మిక్కిలి కోపోద్దీపితుడై యుండెను. ఆ కారణముగా వారు కోపించుచు, శపించుచు, భయపెట్టుచుండిరి. ఆయన పిచ్చివాడా యేమను సంశయము నా మనస్సులో మెదిలెను. మామూలుగనే ఆరతి పూర్తియాయెను. ఆనాటి సాయంకాలము నేను బాబా పాదములను ఒత్తుచుంటిని. అప్పుడు బాబా ప్రేమగా నా తలనిమురుచు, 'నేను పిచ్చివాడను కాను!' అనెను. ఎంత యాశ్చర్యము! నా హృదయగత భావమును గ్రహించుచున్నారు. వారికి తెలియకుండ మనము ఏ రహస్యములను దాచజాలము. వారు యంతర్యామి, నా యాత్మయొక్క యంతరాత్మయని నేననుకొంటిని. అటు పిమ్మట వారి యంతర్యామిత్వమును గూర్చి నాకనేక నిదర్శనములు కలిగెను. వారు నాతో మాట్లాడునప్పుడు నాహృదయములో కూర్చుండి, మాట్లాడు వాని వలె మాట్లాడు వారు. నాహృదయములో గల యాలోచనలను, కోరికలను గ్రహించుచుండెడివారు. వారు నాలో నున్న భగవంతుడు. వారే భగవంతుడని నిశ్చయించుటలో నాకెట్టి సంకోచము లేకుండెను. ఒక్కొక్కప్పుడు వారిని నేను పరీక్షించుచుంటిని. ప్రతి పరీక్షలో వారు సర్వజ్ఞులనియు, వారి యిచ్ఛానుసారము సర్వమును నడిపించెదరను ఒకే నమ్మకము కలుగుచుండెను.''

4. రావు బహద్దూర్ యమ్.డబ్ల్యు. ప్రధాన్ వ్రాసిన 'శిరిడి సాయిబాబా' యను గ్రంథమునకు ఉపోద్ఘాతములో గౌరవనీయులును, అమరావతిలో ప్రసిద్ధికెక్కిన వకీలును నగు దాదాసాహెబు ఖాపర్డే యిట్లు చెప్పియున్నారు.

''శ్రీ సాయి బాబా ప్రతివారి యంతరంగమందు మెదలు ఆలోచనలన్నియు తెలిసిన వానివలె వుండి, వారి కోరికలు తీర్చుచు సుఖసంతోషములు కలుగజేయుచుండెడివారు. ఆయన భూమిపై నడయాడు దైవమనే భావము కలుగుచుండెను.''

5. దాసగణు మహారాజు తమ 'స్తవన మంజరి' యను స్తోత్రమునందు సాయిబాబాను జగత్తుయొక్క సృష్టికర్తగాను నిర్మలమయిన యంతరాత్మగాను నిత్యశాంతమూర్తిగాను వర్ణించియున్నారు.

6. హేమాండ్‌పంతు శ్రీసాయి సచ్చరిత్రము యొక్క మొదటి అధ్యాయములో సాయిబాబాను గోధమలు విసరుచుండిన యొక వింతయోగిగా వర్ణించెను. కాని రాను రాను బాబాతో సంబంధము పెరిగిన కొలది, బాబాను భగవంతుడనియు, సాక్షాత్పరబ్రహ్మస్వరూపుడనియు చెప్పియున్నారు.

7. శిరిడి భక్తులందరు, ముఖ్యముగా మాధవరావు దేశ్‌పాండే వురఫ్ శ్యామా యనువారు బాబాకు మిక్కిలి భక్తులు; వచ్చిన భక్తులందరితో కలసిమెలసి తిరుగువాడు. ఆయనెల్లప్పుడు బాబాను 'దేవా'యని సంభోదించువాడు.

ఈ భక్తులందరి యభిప్రాయములను అవధరించి, వారు చెప్పినదానిలోని యదార్థమును గ్రహించి శ్రీసాయి యవతారపురుషుడని భావించెదముగాక!

ఉపనిషత్‌ద్రష్టలైన మన పూర్వఋషులు భగవంతుడు సర్వాంతర్యామి యను సత్యమును దర్శించిరి. బృహదారణ్యక, ఛాందోగ్య, కఠ, శ్వేతాశ్వతర ఉపనిషత్తులు జీవకోటితో సహ సర్వసు సముదాయమైన ప్రకృతి యంతయు సర్వాంతర్యామి భగవంతుని రచనయనియు, అది యంతయు నంతర్యామిచే, అనగా సర్వమును సృష్టించి పాలించెడి భగవంతునిచే, వ్యాపింపబడి యున్నదనియు వక్కాణించుచున్నవి. ఈ సిద్ధాంతమును నిరూపణ చేయుటకు తగిన యుదాహరణము శ్రీసాయియే! ఈ శ్రీసాయిసచ్చరిత్రము ను సాయిబాబాకు సంబంధించన ఇతర గ్రంథములను చదివినవారు తప్పక యీ సత్యమును గ్రహించి, యదార్థమయిన శ్రీ సాయిని దర్శించగలరు!